ఉగాది కానుకగా సన్న బియ్యం



రేషన్ షాపులో నిల్వ ఉన్న సన్న బియ్యం

- నేటి నుంచి రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ
- అధికారికంగా ప్రారంభించనున్న ప్రభుత్వం
- జిల్లాలో 578 రేషన్‌షాపుల్లో 2.53 లక్షల రేషన్‌కార్డులు
- ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున బియ్యం సరఫరా
- ప్రతీ నెల 4,700 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ
- ప్రస్తుతం జిల్లాలో 24 వేల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం స్టాక్

కామారెడ్డి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగను పురస్కరించుకుని రాష్ట్రప్రభుత్వం రేషన్‌కార్డుదారులకు సన్న బియ్యాన్ని పంపిణీ చేయనుంది. పండుగ కానుకగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం అధికారికంగా ప్రారంభించనుంది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తెల్లరేషన్‌కార్డు దారులందరికీ సన్న బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా జిల్లాలో సన్న బియ్యం పంపిణీకి నిల్వలను అందుబాటులో ఉంచింది. ఇప్పటికే బియ్యాన్ని ఆయా రేషన్ దుకాణాలకు పౌర సరఫరాల శాఖ సరఫరా చేసింది. ప్రస్తుతం ఈ నిర్ణయంతో సన్న బియ్యం కొనుగోలు చేయలేని పేదలకు ప్రయోజనం చేకూరనుంది. అలాగే అక్రమంగా సాగుతున్న రేషన్ బియ్యం దందాకు చెక్ పడే అవకాశం ఉంది.

జిల్లాలో 2.53లక్షల రేషన్‌కార్డులు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో మొత్తం 578 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 5,53,293 రేషన్‌కార్డులు ఉన్నాయి. ఇందులో ఆహార భద్రత కార్డులు 2,34,730 మంది ఉండగా అంత్యోదయ ఆహార భద్రత కార్డులు 17,664, అన్నపూర్ణ కార్డులు 901 ఉన్నాయి. ఈ కార్డులకు గాను ప్రతీనెల 4,700ల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ లబ్ధిదారులకు పంపిణీ చేస్తోంది. ఆహారభద్రత కింద ఒక్కో మనిషికి ఆరు కిలోల చొప్పున బియ్యం, అంత్యోదయ కార్డుదారులకు 35 కిలోలు, అన్నపూర్ణ కార్డుదారులకు 10 కిలోల చొప్పున సరఫరా చేస్తున్నారు. ప్రతీ నెల 1 నుంచి 15వ తేదీ వరకు బియ్యం పంపిణీ చేయాల్సి ఉంటుంది.

24 వేల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం నిల్వలు

వానాకాలం, యాసంగి సీజన్‌లలో రైతుల నుంచి ప్రభుత్వం దొడ్డు, సన్న రకం ధాన్యాన్ని కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు కేటాయించి సీఎంఆర్ కింద తిరిగి పౌర సరఫరాల శాఖ దొడ్డు, సన్న రకం బియ్యాన్ని సేకరిస్తోంది. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీ రేషన్‌కార్డుదారుడికి సన్న బియ్యం పంపిణీ చేస్తామని హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో జిల్లాలో 578 రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీకి ఆదివారం నుంచి శ్రీకారం చుట్టనున్నారు. ఇప్పటికే సన్న బియ్యాన్ని పౌర సరఫరాల శాఖాధికారులు ఆయా రేషన్‌షాపులకు సరఫరా చేశారు. ప్రస్తుతం జిల్లాలో 24 వేల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం నిల్వలు ఉన్నాయి. ప్రతీనెల జిల్లాలో ఉన్న రేషన్ కార్డుదారులకు 4700ల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉన్న సన్న బియ్యం నిల్వల ప్రకారం 6 నెలల వరకు కార్డు లబ్ధిదారులకు పంపిణీ చేయవచ్చని సంబంధిత శాఖాధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం, సంక్షేమ హాస్టళ్లకు సుమారు 600 మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని ప్రభుత్వం సరఫరా చేస్తోంది.



లబ్ధిదారులకు బియ్యాన్ని సరఫరా చేస్తున్న దృశ్యం (ఫైల్)

సన్న బియ్యం నాణ్యతపైనే సందేహాలు

గతంలోనూ బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా సన్న బియ్యం అందించే ప్రయత్నం చేసినప్పటికీ నాణ్యత కొరవడింది. రెండు, మూడు నెలల పాటు సరఫరా చేయగా అందులో నూకలు, తౌడు రావడంతో పేదలు వాటిని తినకుండా వ్యాపారులకు విక్రయించారు. ఈ క్రమంలో ప్రస్తుత ప్రభుత్వం పంపిణీ చేయనున్న బియ్యం నాణ్యతపై కార్డుదారుల్లో సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే ప్రభుత్వం సన్న వడ్లకు రూ.500 బోనస్ అందజేసి కొనుగోలు చేయడంతో నాణ్యమైన బియ్యం వచ్చే అవకాశం ఉందనే అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు. దీంతో పేదలకు మేలు చేకూరనుంది.

అక్రమ దందాకు చెక్ పెట్టేనా?

ఆహార భద్రత కార్డు దారులకు ప్రస్తుతం చౌకదరల దుకాణం ద్వారా ఒక్కో వ్యక్తికి 6 కిలోల బియ్యం అందిస్తోంది. ఇవి దొడ్డువి కావడంతో చాలా మంది వీటిని తినడానికి ఇష్టపడడం లేదు. అలాంటి వారు తమకు రావాల్సిన కోటా బియ్యాన్ని డీలర్లకే కిలో రూ.15 చొప్పున విక్రయిస్తున్నారు. ఇలా కొనుగోలు చేసిన బియ్యాన్ని డీలర్లు వ్యాపారులకు రూ.25 చొప్పున విక్రయిస్తున్నారు. మరికొంత మంది బియ్యాన్ని నెలల తరబడి నిల్వ చేసి తమ ఇంటి వద్దకు ఆటోలతో వచ్చే వారికి అమ్ముతున్నారు. పేదలకు అందాల్సిన ఈ రేషన్ బియ్యాన్ని దళారులు, వ్యాపారులు కలిసి పొరుగు రాష్ట్రాలకు లారీల్లో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపంతో ఈ దందా యథేచ్ఛగా సాగుతూ వస్తోంది. తాజాగా సన్న బియ్యం పంపిణీ ద్వారా ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట పడనుందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

రేషన్ షాపులకు సన్న బియ్యం సరఫరా చేశాం

• మల్లికార్జున్‌బాబు, డీఎస్‌వో, కామారెడ్డి

రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకోసం జిల్లాలో సన్న బియ్యాన్ని రేషన్ కార్డుదారులకు ఆదివారం నుంచి పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. జిల్లాలో 578 రేషన్ దుకాణాలకు ఇప్పటికే సన్న బియ్యాన్ని సరఫరా చేశాం. ప్రస్తుతం జిల్లాలో 24 వేల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం ఉన్నాయి. ఆరు నెలల పాటు సన్న బియ్యానికి కొరత లేదు.

నూతన ఒరవడికకు నాంది ఉగాది

- నేటి నుంచి శ్రీ విశ్వావసు నామ తెలుగు సంవత్సరం ప్రారంభం
- కామారెడ్డిలో ఆకట్టుకోనున్న ఎడ్లబండ్ల ప్రదర్శన
- వీక్లీ మార్కెట్‌లో ఏర్పాట్లు పూర్తి, ముస్తాబైన పలు ఆలయాలు
- వైభవంగా నిర్వహించనున్న పంచాంగ శ్రవణం

కామారెడ్డి టౌన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): శ్రీ విశ్వావసు నామ తెలుగు సంవత్సరం ఉగాది పర్వదినాన్ని ఆదివారం జిల్లాలో జరుపుకోనున్నారు. జిల్లాలో ఉగాది పండుగ ఏర్పాట్లు కోసం ఆలయాల్లో సర్వం సిద్ధం చేశారు. జిల్లాలోని అన్ని ఆలయాలు పండుగ వేడుకల కోసం అందంగా ముస్తాబయ్యాయి. ఉగాది పండుగ రోజున ఆలయాల్లో పంచాంగ శ్రవణాన్ని వేద పండితులు వినిపిస్తారు. రాశులు మానవులకు ఏ విధంగా మంచి, చెడు ఫలితాలు అందిస్తాయో పంచాంగ శ్రవణంతో పండితులు వివరిస్తారు. జిల్లా ప్రజలు ఉదయాన్నే నిద్ర లేచి తలంటు స్నానాలు ఆచరిస్తారు. అనంతరం ఇంటి గుమ్మాలకు మామిడి తోరణాలను అలంకరించి పిండి వంటలు, పచ్చడిని తయారు చేసి సేవిస్తారు.



వీక్లీ మార్కెట్‌లో ఎడ్ల బండ్ల ప్రదర్శనకు ముస్తాబైన ఆలయం

షడ్రుచుల సమ్మేళనం ఉగాది పచ్చడి

ఉగాది పండుగకు మాత్రమే ప్రత్యేకంగా తినే పదార్థం పచ్చడి. కొత్త చింత పండు, బెల్లం, మామిడి పిందెలు, వేప పువ్వు, ఉప్పు, మిరియాలు మొదలైన పదార్థాలను ఉపయోగించి షడ్రుచుల సమ్మేళనం. తీపి, పులుపు, కారం, ఉప్పు, వగరు, చేదు అనే ఆరు రుచులు జీవితంలోని బాధ, సంతోషం, ఉత్సాహం, నేర్పు, సహనం, సవాళ్లకు సంకేతాలు. సంవత్సరం పొడువునా ఎదురయ్యే మంచి చెడులను కష్టసుఖాలను ఒకేలా స్వీకరించాలన్న సందేశాన్ని చెప్పకనే చెబుతుంది ఉగాది పచ్చడి.

కామారెడ్డిలో ఉగాది సందడి

పట్టణ అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో వీక్లీ మార్కెట్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు వేద పండితుల మధ్య పంచాంగ శ్రవణాన్ని వినిపించనున్నారు. అనంతరం 4 గంటలకు ఎడ్లబండ్ల ప్రదర్శన ప్రారంభం కానుంది. వీక్లి మార్కెట్‌లోని ముత్యాలమ్మ, పోచమ్మ, దుర్గమ్మ, ఊరడమ్మ, రాజరాజేశ్వర ఆలయాల చుట్టు ఎడ్ల బండ్ల ప్రదర్శన జరిపి అక్కడి నుంచి జేపీఎన్ రోడ్, పాంచ్ చౌరస్తా, సరోజినీ దేవిరోడ్, హరిజనవాడ రోడ్ల గుండా పెద్దమ్మ గుడి ఆలయం వరకు ప్రదర్శన జరిపి ముగిస్తారు. ఎడ్లబండ్లను, ఎడ్లను రంగులతో అందంగా తయారు చేసి పోటీ తత్వంతో ప్రదర్శనలో ఆయా కుల సంఘాలు, యువజన, తదితర సంఘాలు ప్రదర్శనలో పాల్గొంటారు. ఉగాది పండుగ కోసం పట్టణంలోని ముత్యాలమ్మ, మత్తడి పోచమ్మ, దుర్గమ్మ, లస్మమ్మ, పెద్దమ్మ, నల్లపోచమ్మ, గడి మైసమ్మ, వేణుగోపాలస్వామి, కోదూరి వీరహనుమాన్, హనుమాన్ ఆలయం, పెద్దమ్మ తల్లి ఆలయం, రాజరాజేశ్వరీ ఆలయాలను ముస్తాబు చేయనున్నారు. మున్సిపల్ ఆధ్వర్యంలో నీటి సౌకర్యం, వీధి దీపాలు, రోడ్లు చదును ఏర్పాట్లు చేపట్టారు. ఉగాది వేడుకలకు ఆయా గ్రామాలు, మండలాల నుంచి వేలాది మంది ప్రజలు ఎడ్లబండ్ల ప్రదర్శనను వీక్షించేందుకు హాజరవుతారు. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించనున్నారు. జిల్లాలోని అన్ని ప్రధాన కూడళ్లలో మామిడి కొమ్మలు, కొత్త కుండలు, రంజన్, పూలు తదితర పూజా సామగ్రితో సందడిగా మారాయి.



పూజా సామగ్రిని కొనుగోలు చేస్తున్న దృశ్యం

మహిళా సంఘాలకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేటాయించాం

కామారెడ్డి టౌన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిర్ణయం మేరకు మహిళా సంఘాలకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎక్కువగా కేటాయించడం జరిగిందని, ఎలాంటి సమస్యలు రాకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. 2024-25 యాసంగి సీజన్‌లో వరి ధాన్యం కొనుగోళ్లపై గ్రామ అధ్యక్షుడు, సబ్ కమిటి, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆకాంక్ష మేరకు మహిళా సంఘాల ద్వారా వరి ధాన్యం కొనుగోళ్లకు ఈ యాసంగి సీజన్‌లో 183 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, గతంలో జిల్లాలో 27 కేంద్రాల్లో కొనుగోలు చేసిన మహిళ సంఘాలకు ఈసారి మరో 156 కేంద్రాలు సంఘాలకు అదనంగా 41 శాతం కేటాయించడం జరిగిందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం కోతలు ప్రారంభం అయ్యాయని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి అవసరమైన పరికరాలు క్యాలిపర్స్, టార్పాలిన్, తూకం యంత్రాలు, తేమ కొలిచే యంత్రం తదితర పరికరాలతో పాటు కేంద్రంలో తాగునీరు, వేసవి దృష్ట్యా నీడ ఏర్పాటు, ఓఆర్ఎస్ ప్యాకెట్స్ తదితర ఏర్పాట్లు చేయాలని తెలిపారు. సన్న బియ్యంకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించడం జరుగుతుందని తెలిపారు. రబీ సీజన్‌లో వడగళ్ల వానలు పడే ఆస్కారం ఉంటుందని, టార్పాలిన్‌లను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. 17 శాతం తేమ ఉన్న వడ్లను కొనుగోలు చేసుకోవచ్చని, దొడ్డు, సన్నం వడ్లను విడివిగా పెట్టాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యంను ట్యాబ్ ఎంట్రి చేసి మిల్లులకు తరలించాలని, రైతులకు రెండు రోజుల్లో చెల్లింపులు వచ్చే విధంగా ఏర్పాటు చేయాలని అన్నారు. అదనపు కలెక్టర్ వి.విక్టర్ మాట్లా డుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారంగా జిల్లాలోని మహిళలకు ఎక్కువ కొనుగోలు కేంద్రాలు కేటాయించడం జరిగిందని, పురుషులతో సమానంగా కొనుగోలు చేయాలని తెలిపారు. అంతకుముందు వడ్లు కొనుగోలు, కొలతలు వంటి అంశాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డీఆర్‌డీవో సురేందర్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాజేందర్, జిల్లా సహకార అధికారి రామ్‌మోహన్, జిల్లా మార్కె టింగ్ అధికారిని రమ్య, అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మురళీకృష్ణ, మహిళా సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

హార్డ్‌వర్క్ చేసే గుణం కలిగిన వ్యక్తి శ్రీనివాస్‌రెడ్డి

వ్యక్తిత్వం, మంచి నైపుణ్యత, సహాయ గుణం, హార్డ్‌వర్క్ చేసే గుణం కలిగిన వ్యక్తి శ్రీనివాస్‌రెడ్డి అని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆత్మీయ వీడ్కో లు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గత 10 నెలలుగా పని చేసిన ఆయన మంచి పేరు సంపాదించుకున్నారని, విధుల్లో నిబద్ధత కలిగిన వ్యక్తి అని కొనియాడారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లును తక్షణమే ఆమోదించాలి

- బీసీ బిల్లును ఆమోదించకుంటే బీజేపీపై పోరాటం చేస్తాం
- బీసీ రిజర్వేషన్‌లు అమలు చేయకపోతే కాంగ్రెస్, బీజేపీ వారిని గ్రామాల్లో తిరగనివ్వం
- బీసీ బిల్లును అసెంబ్లీలో ఆమోదించి చోటే భాయి.. బడే భాయికి అప్పగించారు
- బీఆర్ఎస్ జాగృతి పోరాట ఫలితంగానే రాష్ట్ర చట్టసభల్లో బీసీ బిల్లును ఆమోదించింది
- కామారెడ్డి బీసీ రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కవిత

కామారెడ్డి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ చట్టసభల్లో ఆమోదించిన బీసీ బిల్లులను బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్ ఆమో దించాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బీసీ బిల్లును ఆమోదించడానికి తెలంగాణ కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు పార్లమెంట్ గళమెత్తాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బీసీ బిల్లును ఆమోదించకుంటే అవసరమైతే బీఆర్ఎస్ ఢిల్లీకి వస్తుందని బీజేపీపై పోరాటం చేస్తుందని హెచ్చరించారు. కానీ కాంగ్రెస్ పార్టీ మాత్రం తప్పించుకునే ప్రయత్నం చేయవద్దన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని శుభం కన్వెన్షన్‌లో తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ ఆధ్వర్యంలో బీసీ రౌండ్ టేబుల్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయకపోతే గ్రామాల్లో కాంగ్రెస్, బీజేపీ ప్రజాప్రతినిధులను, నాయకులను తిరగనివ్వమని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో అమలుకాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కలిపించకపోతే కాంగ్రెస్ చరిత్రహీనులుగా మారిపోతుందన్నారు. బీసీ బిల్లును కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించిన తర్వాత చోటె భాయి సీఎం రేవంత్‌రెడ్డి.. బడే భాయి ప్రధాని మోదీకి అప్పగించారన్నారు. రిజర్వేషన్ అమలుపై రేవంత్ సర్కార్ కోర్టుకు వెళ్తారా లేదా ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీ కాళ్ల మీద పడుతారా మాకు సంబంధం లేదు. 42 శాతం రిజర్వేషన్‌లు మాత్రం అమలు చేయాల్సిందేనని ఆమె డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల కోసం అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు ప్రధానమంత్రి అపాయింట్‌మెంట్ ఇవ్వలేదన్నారు. తెలంగాణలో కంటే ఎక్కువగా ఢిల్లీలోనే ఉండే సీఎం రేవంత్‌రెడ్డికి ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్ ఎందుకు దొరకడం లేదని ఆమె ప్రశ్నించారు. బీసీల విషయం వచ్చేసరికి ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్ ఎందుకు ఇవ్వడం లేదని బీజేపీ ప్రభుత్వాన్ని నిలదీశారు. తమిళనాడులో అమలవుతున్న రిజర్వేషన్ల తరహాలో తెలంగాణలో కూడా అమలు చేయడానికి ప్రధాని మోదీ చొరవ తీసుకోవాలన్నారు. కులగణన చేయబోమని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసి బీసీలను వంచించిందని అన్నారు. బీఆర్ఎస్, తెలంగాణ జాగృతి పోరాట ఫలితంగానే కాంగ్రెస్ ప్రభుత్వం చట్టసభల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లకు ఆమోదం తెలిపిందన్నారు. ఎన్నికల సమయంలో కేవలం రాజకీయంగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని హామీ ఇచ్చిందని మా పోరాటంతో విద్యా, ఉద్యోగాల్లోనూ రిజర్వేషన్‌లు కల్పిస్తూ చట్టం చేసిందన్నారు. ఎంబీసీ కులాలకు మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. ఇంత వరకు ఎంబీసీ మంత్రిత్వ శాఖ ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో పార్టీ బీసీలకు పెద్దపీట వేసిందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో బీసీలకు రూ.1.55 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేసిందన్నారు. బీసీ నాయకత్వం బలపడడానికి ఐదుగురిని రాజ్యసభకు, ఎనిమిది మందికి ఎమ్మెల్సీలు, 58 మందికి కార్పొరేషన్ చైర్మన్ పదవులను ఇచ్చామన్నారు. దేశంలోనే నెంబర్ వన్ యూనివర్సిటీ అయిన ఉస్మానియా యూనివర్సిటి వీసీ పదవికి ఉమ్మడి రాష్ట్రంలో ఎప్పుడు కూడా బీసీ వర్గానికి కేటాయించలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడగానే కేసీఆర్ మొట్టమొదటిసారిగా రవీంద్రయాదవ్‌ను వీసీగా నియమించిందని అన్నారు. అడ్వకేట్ జనరల్‌గా బీసీ బిడ్డ అయిన ప్రసాద్‌ను నియమించిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో 15 నెలల్లో కులవృత్తులు కుదేలవుతున్నాయో చూస్తున్నామన్నారు. కేసీఆర్ గతంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో బీసీల జనాభా 52 శాతంగా తేలిందన్నారు. కానీ కాంగ్రెస్ నిర్వహించిన కుల సర్వే ద్వారా బీసీల జనాభా తగ్గించి ఓసీల జనాభా పెంచారని మండిపడ్డారు. గ్రామాల వారిగా, కులాల వారిగా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన జనాభా లెక్కలు బయటపెట్టాలని డెడికేటెడ్ కమిషన్ నివేదికను ఎందుకు బయటపెట్టడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ ప్రశ్నించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, మాజీ టీఎస్‌పీఎస్‌సీ మెంబర్ సుమిత్రానంద్, బీఆర్ఎస్ నేతలు సంపత్‌గౌడ్, బాజిరెడ్డి జగన్, బీసీ నేతలు నరాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

మైనార్టీల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

కామారెడ్డి టౌన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మైనార్టీల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. శనివారం టెక్రియాల్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం ఇఫ్తార్‌లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల, నిరుద్యోగుల సహకారంతో అధికారంలోకి వచ్చిందని తెలిపారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించే దిశగా రాజీవ్ యువ వికాసం పథకాన్ని అందుబాటులోకి తెచ్చిందని అన్నారు. రేవంత్‌రెడ్డి అన్ని రంగాల్లోనూ తెలంగాణ పురోగమించేలా, దేశంలోనే అగ్ర రాజ్యంగా ఆవిర్భవించాలని కోరుతూ రంజాన్ మాసంలో ప్రత్యేకంగా ప్రార్థనలు చేయాలని ముస్లిం సామాజిక వర్గాన్ని కోరుతున్నానన్నారు.

రామాంజనేయ విగ్రహ ప్రతిమల శోభాయాత్ర

బిచ్కుంద, మార్చి 29(ఆంధ్రజ్యోతి): అంజనేయ స్వామి సామూహిక పడిపూజ సందర్భంగా శనివారం రామ, ఆంజనేయస్వామి విగ్రహాల శోభాయాత్రను చేపట్టారు. మండల కేంద్రంలోని మింజర్ బాలాజీ హనుమాన్ ఆలయంలో బిచ్కుంద మఠాధిపతి సోమలింగాశివాచార్యుల ఆశీస్సులతో పడిపూజ మహోత్సవం సందర్భంగా రకరకాల పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం 6 గంటలకు స్వాములందరూ హనుమాన్ చాలీసా పారాయణం తర్వాత శోభాయాత్ర భక్తులకు బిచ్కుంద హనుమాన్ సేవసమితి ఆధ్వర్యంలో మహా అన్నదానం ఏర్పాటు చేశారు. బాన్సువాడ, బోధన్, ఎల్లారెడ్డి, నారాయణఖేడ్ తదితర ప్రాంతాల దీక్ష స్వాములు పాల్గొని విజయవంతం చేశారు.

పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలి

● బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో



పన్నులను చెల్లిస్తున్న బోధన్ క్లబ్ సభ్యులు

బోధన్‌రూరల్,మార్చి29(ఆంధ్రజ్యోతి):పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి ప్రతీ ఒక్కరు సహకరించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. శనివారం బోధన్ క్లబ్ సభ్యులు మున్సిపాలిటీకి చెల్లించాల్సిన రూ.19,99,252లను సబ్ కలెక్టర్ చేతుల మీదుగా కట్టేశారు. ఈ సందర్భంగా బోధన్ క్లబ్ సభ్యులను సబ్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ నారాయణ అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, దుకాణదారులు, వ్యాపారస్థులు తమ ఇంటి పన్నులను సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలన్నారు. ప్రభుత్వం వడ్డీపై 90శాతం రాయితీ ఇచ్చిందని దీనిని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో బోధన్ క్లబ్ సభ్యులు ఉమేష్ షిండే, రుద్ర సత్యనారాయణ, క్లబ్ సభ్యులు తదితరులున్నారు.

● మందర్నా ఇసుక క్వారీపై దుష్ప్రచారాలను నమ్మొద్దు

మందర్నా ఇసుక క్వారీపై దుష్ప్రచారాన్ని నమ్మొద్దని గ్రామ రైతులు, కూలీలు శనివారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ఇసుక ఆదాయం కీలకమన్నారు. దుష్ప్రచారాన్ని నమ్మొద్దని గ్రామస్థులు పేర్కొన్నారు. సాలూర మండలం మందర్నా గ్రామ రైతులు, కూలీలు, గ్రామంలో నడుస్తున్న ఇసుక క్వారీలపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నామన్నారు. ఇసుక క్వారీ నిరుపేద కూలీల ఉపాధికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మంజీర నదిలో ఇసుకను గతంలో మహారాష్ట్ర ప్రభుత్వం తమ పక్కన ఉన్న ప్రాంతాలలో ఇసుక తీసుకుపోవడంతో మన ప్రాంతంలోకి వచ్చి మహారాష్ట్ర వాసులు ఇసుక తీసుకెళ్లిన సందర్భాలు అనేకం ఉన్నాయన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆదాయానికి ఈ విధంగా గండికొట్టిందన్నారు. ఈ సంవత్సరం మందర్నా గ్రామ శివారులో అధికారికంగా ఇసుక క్వారీని ప్రారంభించామన్నారు. గ్రామాభివృద్ధికి కీలమైన ఇసుక ఆదాయం ఈ క్వారీ ద్వారా గ్రామ పంచాయతీకి సినరేజ్ చార్జ్ రూపంలో ఆదాయం సమకూరుతుందన్నారు. క్వారీ నడవడం వల్ల రోడ్డు సౌకర్యాలు, నిరుపేద కూలీలకు ఉపాధి అవకాశాలు రోజువారి పనులు దొరుకుతున్నాయన్నారు. ప్రభుత్వ అధికారులు ప్రచారాలను నమ్మవద్దని, గ్రామాభివృద్ధి కోసం క్వారీలు కొనసాగేందుకు సహకరించాలని కోరారు.

సుర్భిర్యాల్ గ్రామానికి నిధుల మంజూరు



ప్రొసీడింగ్ కాపీని అందజేస్తున్న వినయ్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్,మార్చి29(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్ గ్రామాభివృద్ధికి ప్రభుత్వం రూ. 48 లక్షల నిధులు మంజూరు చేసింది. ఈనిధులతో గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించనున్నారు. శనివారం ఆర్మూర్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వినయ్‌రెడ్డి గ్రామస్థులకు ప్రొసిడింగ్ కాపీని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భూమారెడ్డి, మహేందర్, లవన్‌కుమార్, రాకేష్, చరణ్, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి పోటెత్తిన జనం





జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల,అష్టముఖి కోనేరు వద్ద భక్తులు పూజలు

ఎడపల్లి,మార్చి29(ఆంధ్రజ్యోతి):శనివారం అమావాస్యను పురస్కరించుకుని జానకంపేట గ్రామ శివారులోగల లక్ష్మి నర్సింహస్వామి ఆలయానకి భక్తులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుండే కాక మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలనుండి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానకి వచ్చి ఆలయ ప్రాంగణంలో గల అష్టముఖి కోనేరులో స్నానమాచరించి ఆలయంలో కొలువైన శ్రీ లక్ష్మి నర్సింహ స్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పా ట్లు చేశారు. ఆలయ పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటన లు జరుగకుండా ఎడపల్లి పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

●స్వామిని దర్శించుకున్న జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల

శనివారం అమావాస్యను పురస్కరించుకుని నిజామాబాద్ జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల అష్టముఖి కోనేరు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి లక్ష్మి నర్సింహస్వామిని దర్శించుకుని కుంకుమార్చన చేశా రు. ఈకార్యక్రమంలో బోధన్ ఏసీపి శ్రీనివాస్, రుద్రూర్ సిఐ కృష్ణ, ఎడపల్లి ఎస్సై, ఆలయ ఈవో, భక్తులు పాల్గొన్నారు.

చదువుతో పాటు అన్ని రంగాలల్లో ముందుండాలి



బ్యాగులు అందజేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,మార్చి29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలలో ముందుండాలని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెడ్‌మాస్టర్ రత్నం, మినిమోని మేనేజర్ మీర్ ముజాఫర్ అలీ అన్నారు. శనివారం బోధన్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉచితంగా బ్యాగులు, పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలలో ముందుండాలన్నారు. ఈ కార్యక్రమంలో మినిమోని మేనేజర్ మీర్ ముజాఫర్ అలీ, సంస్థ అద్యక్షులు మహ్మద్ మునీర్, సోమేశ్వర్‌లతో సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎస్సై నరేష్

రామారెడ్డి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రామారెడ్డి ఎస్సై నరేష్ పేర్కొన్నారు. రామారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రామారెడ్డి మండల కేంద్రంతో పాటు రెడ్డిపేట్, మద్దికుంట, పోసానిపేట్, ఉప్పలవాయి, గిద్ద, ఇసన్నపల్లి, మోషంపూర్, గోకుల్ తండా, రాజమ్మ తండా, రమణ తండా, స్కూల్ తండా, కన్నాపూర్, కన్నాపూర్ తండా, తదితర గ్రామాల్లో, తండాల్లో ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



బోధన్‌లో టీడీపీ జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం



రుద్రూర్‌లో టీడీపీ జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం



నగరంలో జెండాను ఎగురవేస్తున్న దేగాం యాదగౌడ్

జిల్లా వ్యాప్తంగా ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

సుభాష్‌నగర్,మార్చి 29(ఆంధ్రజ్యోతి):తెలుగు దేశంపార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జిల్లాకేంద్రంతోపాటు వివిధ మండలాల్లో పార్టీ జెండాను ఎగురవేసి వేడుకలను జరుపుకున్నారు.జిల్లా కేంద్రంలో శనివారం నిజామాబాద్ పార్లమెంట్ కన్వీనర్ దేగాంయాదగౌడ్ ఆధ్వర్యంలో 43వఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. మొదటగా జిల్లా పార్టీకార్యాలయం ఎదుట టీడీపీ జెండాను ఎగురవేసి అనంతరం ధర్నాచౌక్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నగరంలోని దుబ్బచౌరస్తా,నాందేవ్‌వాడ, హమాల్‌వాడి, వెంగళ్‌రావునగర్ కాలనీ, గోల్ హన్మాన్,ఎల్లమ్మగుట్ట, ఎస్ఎఫ్ఐ తదితరప్రాంతాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం పార్లమెంట్ కన్వీనర్ దేగాం యాదగౌడ్ మాట్లాడుతూ తెలుగు ఖ్యాతిని ప్రపంచవ్యాప్తం చేసిన ఎన్టీఆర్‌కు భారత రత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. 43సంవత్సరాలుగా పార్టీలో ఉన్న కార్యకర్తలందరికి ధన్యవాదాలు తెలిపారు. తెలుగు దేశం పార్టీ పుట్టుకను ఒక నవశకంగా చెప్పుకొచ్చారు. తెలుగువాడికి ఎలాంటి గుర్తింపు లేని సమయంలో ఎన్టీఆర్ టీడీపీ పార్టీని పెట్టి ప్రజలను చైతన్యపరుస్తూ ప్రపంచ స్థాయిలో తెలుగు వారికి గుర్తింపు తెచ్చారన్నారు. ఈ కార్యకమంలో నాయకులు వినోద్‌కుమార్, జ్యోతి నారాయణ, అంబిక సత్యనారాయణ, దంతాల ఆనంద్, కోయేడి నర్సింలు, పురుషోత్తం, రమేష్, రాజు, విష్ణు, నాగేశ్వర్‌రావు, మల్లారెడ్డి, రాజు, స్వామి, రాజేశ్వర్, రవికుమార్, శేఖర్, రషీదా, బిందు, లక్ష్మీయాదవ్, విజయలక్ష్మీ, మల్లేశ్వరి, కమల బాయి, అజీజ్, రాజేశ్వర్‌గుప్త, మల్లేష్‌యాదవ్, జాఫర్, సర్వరాజ్, పాల్గొన్నారు.

మోపాల్: నగరంలోని బోర్గాం(పి) గ్రామంలో శనివారం తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. పార్టీ జెండాను ఎగరవేశారు. తెలుగుదేశం పార్టీ హయాంలో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి జరిగిందని బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం స్వర్గీయ ఎన్టీరామారావు ఎంతో కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ల అనే నినాదంతో నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని ఆవిర్భావించారని తెలుగు దేశం పార్టీ అడక్ కమిటీ సభ్యులు కోట గోపాల్ రెడ్డి అన్నారు. శనివారం తెలుగు దేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బోధన్ మండలంలోని సాలూర క్యాంప్, పట్టణంలోని రాకాసిపేట్, ఏరాజ్‌పల్లి తదితర ప్రాంతాలలో ఎన్‌టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం తెలుగు దేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాలకు స్వేచ్ఛను ఇచ్చిన పార్టీ, పేదలకు ఆత్మ గౌరవంతో కూడిన సంక్షేమాన్ని అందించిన పార్టీ తెలుగింటి ఆడపడుచుల కోసం మహిళ సాధికారితను ఇచ్చిన పార్టీ తెలుగు జాతి అభ్యున్నతి కోసం మహోన్నతమైన ఆశయాలతో ఆనాడు నందమూరి తారక రామారావు పార్టీని స్థాపించారని కొనియాడారు. పార్టీని ఆదరిస్తున్న ప్రజలకు, నిరంతరం శ్రమిస్తున్న వారికి పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ నాయకులు పావులూరి వెంకటేశ్వర్ రావు, సీహెచ్‌వీ హన్మంత్ రావు, కృష్ణా రెడ్డి, సచిన్ పటేల్, విశ్రాంత ఎంఈవో బాలగంగాధర్, మాజీ ఎంపీటీసీ శౌరయ్య చౌదరి, శ్రీనివాస్, శ్రీను, బాబు రావు, రామారావు, సుధాకర్, మేస్త్రీ ఈశ్వర్ రావు, రామారావు, వెంకటేశ్వర్ రావు, గోగినేని సుబ్బారావు, వినోద్, సత్యనారాయణ, మార్ని రాజా, రవి, కృష్ణా రెడ్డి, సచిన్, వెంకటేష్, శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

వర్ని: వర్ని మండల కేంద్రంలో శనివారం తెలుగు దేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ రాష్ట్ర కార్యదర్శి విఠల్, నిజామాబాద్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శులు పావులూరి వెంకటేశ్వర్ రావు, సీహెచ్ హన్మంత్ రావు, బోధన్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట గోపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు బొగుళ్ల వినోద్, వై.సత్యనారాయణ, మార్ని రాజు, ఎం.రవికుమార్, కృష్ణారెడ్డి, ఎం.రవికుమార్, డీ.కృష్ణారెడ్డి, సచిన్, వెంకటేష్, మద్దిపూడి శ్రీనివాస్, పెండెం సత్యనారాయణ, శివ, తదితరులు పాల్గొన్నారు.

మెండోర: తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి ఎన్టీఆర్ అని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గోపిడి రాజన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించి, టీడీపీ జెండాను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముస్కు సురేష్, తెలుగు యువత మండల అధ్యక్షుడు కొమ్ముల ప్రభాకర్, కొప్పెల ముత్యం, లక్కంపల్లి చిన్న గంగాధర్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి: తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎల్లారెడ్డి నియోజకవర్గ నాయకులు దేమే కమ్మరి రాజు మాట్లాడుతూ తెలుగు ప్రజలందరికీ తెలుగు నూతన సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తూ తాడ్వాయి మండలంలోని కృష్ణాజివాడి గ్రామంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలవేసి జెండా ఎగురవేశారు. అనంతరం పండ్ల పంపిణీ చేశారు. తెలుగు ప్రజలకు రాజకీయ సామాజిక ఆర్థిక అంశాలలో ముందుకు తీసుకెళ్లి తెలుగు ప్రజలను చైతన్యపరిచిన ఏకైక నాయకుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు, ఆయనను మన తెలుగు ప్రజలు ఎక్కడున్నా గుర్తుంచుకునే విధంగా తెలుగు ప్రజలను ముందుకు తీసుకెళ్లిన నాయకుడు రామారావు. ఈ కార్యక్రమంలో నాయకులు కుర్మ దత్తయ్య, గంగారెడ్డి, కమ్మరినర్సింలు, నాగ భూషణం, కమ్మరి రాజేష్, రాజారెడ్డి, రాజయ్య, తెనుగు నర్సింలు, బాలయ్య, సాయిలు, రాములు తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి: రుద్రూరు మండల కేంద్రంలో తెలుగు దేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించి ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఇందూర్ సాయిలు, లాయర్ హన్మంత్ రావు, వెంకటేశ్వర్ రావు పాల్గొన్నారు.

ముప్కాల్:తెలుగుదేశం 43వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను ముప్కాల్ మండల కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు డాక్టర్ రాములు అధ్యక్షతన జెండా ఎగురవేసి, మిఠాయిలు పంచుకున్నారు. గతంలో సీఎంగా ఎన్‌టీఆర్ చేసిన అభివృద్ధి పనులు, సేవలను గుర్తు చేసుకున్నారు. రాబోవు ఎన్నికల్లో పార్టీ బలోపేతం లక్ష్యంగా ముందుకు కదులుతామని వాగ్దానం చేశారు. ఈ కార్యక్రమంలో జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: తెలుగు దేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవం పురష్కరించుకొని డిచ్‌పల్లి మండల కేంద్రంలో రూరల్ పార్టీ ఇంచార్జ్ నర్సింహ రావు ఆధ్వర్యంలో టీడీపీ జెండా ను ఏగరవేశారు. ధర్మారం(బి) లో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ శ్రేణులు పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. రాష్ట్రంలో సంస్కరనలు అమలు చేసిన ఘనత ఎన్టీఆర్ కే దక్కుతుందని 1రూ. కిలో బియ్యం , జనత వస్త్రాలు, పటల్ పట్వరి వ్యవస్థ రద్దు, మండల వ్యవస్థ, బీసీల రిజర్వేషన్లు అమలు చేసిన ఘనత టీడీపీ పార్టీదేనని రూరల్ ఇంచార్జ్ నర్సింహవు అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాయుడు అంజనేయులు, వెంకటేష్, హనుమంతు, విష్ణు, సాయిలు, గంగన్న, జావిద్, పాల్గొన్నారు.

పెర్కిట్: ఆర్మూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తావద్ద తెలుగుదేశం పార్టీ జెండాను ఎగురవేసి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు దేశం పార్టీ బడుగు బలహీన వర్గాలకు గుర్తింపు నిచ్చిందని తెలంగాణ అభివృద్ధి తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడే జరిగిందని పార్టీ నాయకులు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కే. వినోద్ కుమార్, ఎస్ఆర్ రమేష్, అంబిక సంత్యనారాయణ, దంతాల ఆనంద్, పసుల రాజు, శ్రీనివాస్, పురుషోత్తం, గడ్డం శ్రీనివాస్, రంగన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

డొంకేశ్వర్:టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డొంకేశ్వర్ మండల కేంద్రంలో టీడీపీ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం లో పార్లమెంట్ ఇంచార్జీ యాదగౌడ్, వినోద్‌కుమార్, దంతాల ఆనంద్, లక్ష్మీ నారాయణగౌడ్, భూమాగౌడ్, గంగాగౌడ్, నారాగౌడ్, గోవర్ధన్, నర్సయ్య, చిన్నయ్య, సోకన్న, సాయిలు, సుదర్శన్‌గౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మెండోరలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు



బోర్గాం(పి)లో టీడీపీ ఆవిర్భావ దినోత్సవం జరుపుకుంటున్న నాయకులు



ధర్మారంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న టీడీపీ శ్రేణులు

రోగులకు వైద్య సేవలు అందించాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్



నవీపేటలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్

నవీపేట,మార్చి29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు వైద్య సేవలు సక్రమంగా అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో, జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్ అన్నారు. శనివారం నవీపేట ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన ఆసుపత్రి సలహా, అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవీపేట ప్రభుత్వ ఆసుపత్రికి ఈ సంవత్సరం రూ2.25లక్షల అభివృద్ధి నిధులు మంజూరయ్యాయని అన్నారు. సంబంధిత నిధులను రోగులకు సరైన సౌకర్యాలను కల్పించడానికి వినియోగించాలని సూచించారు. నవీపేట ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది కొరత నివారణకు తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల జబ్బులకు మందులు అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎండ వేమిడి నుంచి ఉపశమనం పొందానికి పండ్లు, ఇతర ద్రవ పదార్థాలను తరుచుగా తీసుకోవాలని కోరారు. అంతకు ముందు ఆసుపత్రిలో ఓఆర్ఎస్ కార్నర్‌ను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ బల్వీందర్ సింగ్, తహసీల్దార్ వెంకట రమణ, ఎంపీడీవో నాగనాథ్, మెడికల్ ఆఫీసర్లు కావ్య, నవ్య, మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు ఉషారాణి, ఆసుపత్రి సూపర్‌వైజర్లు కిషన్, వెంకటేశ్వర్ రావు తదితరులున్నారు.

నేడు పంప సాహితీ పీఠం ఆధ్వర్యంలో కవి సమ్మేళనం

బోధన్‌రూరల్,మార్చి29(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం విశ్వవసు నామ సంవత్సరం ఉగాది సందర్భంగా ప్రతి సంవత్సరంలాగా ఈ సంవత్సరం కూడా పంప సాహితి పీఠం ఆధ్వర్యంలో కవి సమ్మేళనం కార్యక్రమం ఉంటుందని పంప సాహితి పీఠం అధ్యక్షులు పురాణే అజయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 5వ తేది రోజున ఉదయం 10గంటలకు ఉషోదయ జూనియర్ కళాశాల ప్రాంగణంలో పంప సాహితి పీఠం ఆధ్వర్యంలో కవి సమ్మేళనం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమానికి కవులు, కళాకారులు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమానికి సబ్ కలెక్టర్ వికాస్ మహతో, తహసీల్దార్ విఠల్‌లతో జిల్లాలోని కవులు, సాహిత్య ప్రియులు, ముఖ్యులు హాజరుకానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంప సాహితి పీఠం ప్రధాన కార్యదర్శి పబ్బ మురళి, గౌరవ అధ్యక్షులు రాజేశ్వర్ రావు, కోశాధికారి లోల శంకర్, ఉపాధ్యక్షులు ప్రభాకర్, మొగిలి స్వామి, రాజు, కోటేశ్వర్ రావు పాల్గొన్నారు.

సుంకినిలో మారుమోగిన రామనామం

కోటగిరి,మార్చి29(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని సుంకిని గ్రామం శనివారం రామనామ స్మరణతో మార్మోగింది. హనుమాన్ మాలధారులు ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల్లో శ్రీ రాముడి చిత్రపటంతో పల్లకి ఊరేగించారు. డీజేతో రామనామ స్మరణతో గ్రామంలో మార్మోగింది. అనంతరం హనుమాన్ మాలధారులకు మండల భిక్షా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు భీంరావు పటేల్, రాందాస్ షిండే, సునీల్ పటేల్, లక్ష్మణ్, శివరాజ్, సాయిలు, హనుమాన్ స్వాములు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు ఉగాది సంబరాలు

నవీపేట,మార్చి29(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగేపూర్, శివతండాలలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో శనివారం ముందస్తు ఉగాది సంబరాలు నిర్వహించారు. శ్రీ విశ్వవసు నామ సంవత్సర ఉగాది సంబరాలను ఆయా పాఠశాలల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సిబ్బంది ఉగాది ప్రాముఖ్యత, రాశుల ఫలితాలు, తెలుగు సంవత్సరాలు, నెలల గురించి వివరించారు. అనంతరం షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని తయారు చేసి విద్యార్థులకు అందించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నాగేపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రేమలత, ఉపాధ్యాయ సిబ్బంది విజయ లక్ష్మి, సబిత, గౌతమిలు పాల్గొన్నారు. శివతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివకుమార్, ఉపాధ్యాయ సిబ్బంది రాజు, మమత, పావని తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

వేల్పూర్, మార్చి29(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం అమీనాపూర్ గ్రామ శివారులోని సాయిబాబా ఆలయం వద్ద హార్వెస్టర్ ఆటోను ఢీ కొన్న సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న వేల్పూర్, అమీనాపూర్ గ్రామాలకు చెందిన పలువురికి గాయాలయ్యాయి. హార్వెస్టర్‌ను డ్రైవర్ అజాగ్రత్తగా నడిపి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఆటో డ్రైవర్ చెలిమెల స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంజీవ్ తెలిపారు.

పసుపు ఉత్పత్తిదారుల సంఘం పరిశ్రమ పరిశీలన



పసుపును పరిశీలిస్తున్న సుచరితారెడ్డి

జక్రాన్‌పల్లి,మార్చి29(ఆంధ్రజ్యోతి): మండలంలోని మనోహరాబాద్‌లో శనివారం జేఎం కేపీఎం రైతు పసుపు ఉత్పత్తిదారుల సంఘ పరిశ్రమను ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి కూతురు సుచారితరెడ్డి పరిశీలించారు. అనంతరం ఈ పరిశ్రమలో పసుపు పౌండర్ చేసే యంత్రాలను ఆమె పరి శీలించారు. పసుపు పౌడర్ ప్రొడక్టు మార్కెటింగ్ చేసే విదానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పసుపు రైతుల సంఘం జిల్లా అధ్యక్షు డు, పసుపు ఉత్పత్తిదారుల సంఘ డైరెక్టర్ పి. తిరుపతిరెడ్డి, రైతులు సంతోష్, గంగారెడ్డి, మహేష్, రుత్విక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లతో కొట్టి హత్య చేసి భార్య

● వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని భర్తను చంపించిన భార్య

బాన్సువాడ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలం కొల్లూరు శివారులో నాగారం గ్రామానికి చెందిన అమృతం విట్టల్(35) దారుణ హత్యకు గురైన ఘటన శనివారం చోటు చేసుకుంది. సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం రాత్రి విట్టల్ ఇద్దరు వ్యక్తులతో కలిసి కొల్లూరు శివారులోని పొలంలో మద్యం సేవించారు. ఇద్దరు వ్యక్తులు పథకం ప్రకారం పైపులతో కొట్టి హత్య చేశారు. మృతదేహాన్ని రోడ్డుపై పడేసి ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. తమ్ముని భార్య అక్రమ సంబంధం పెట్టుకుని హత్య చేయించిందని అన్న సాయిలు ఫిర్యాదు చేశారు. భార్య, మరో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు సిఐ తెలిపారు.

చింతలూర్‌లో సీసీ రోడ్డు పనుల ప్రారంభం

జక్రాన్‌పల్లి,మార్చి29(ఆంధ్రజ్యోతి):మండలంలోని చింతలూర్ గ్రామంలో శనివారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను కొలిప్యాక్ సింగిల్ విండో చైర్మన్ నాగుల శ్రీనివాస్ ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగుల గోపి జలందర్, గంగాధర్, అభిలాష్, హన్మాండ్లు, లింబాద్రి, చిన్నారెడ్డి, శివప్రసాద్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ

ఆర్మూర్‌రూరల్, మార్చి29(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని జిరాయత్ నగర్‌లో శనివారం రక్ష స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఖాందేష్ శ్రీనివాస్ నిరుపేదలకు ఉచిత బియ్యం పంపిణీ చేశారు. అవ్వకు బువ్వ కార్యక్రమంలో భాగంగా ప్రతినెల పేదలకు ఒక్కొక్కరికి 5కిలోల చొప్పున బియ్యంపంపిణీ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి విద్యప్రవీణ్ పవార్, ఉపాధ్యక్షులు ఎస్‌జి శ్రీకాంత్, కోశాధికారి గోనె శ్రీదర్, బేతు గంగాధర్, ఖాందేష్ సత్యం, తులసి పట్వారి, మీర శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

పనులను పరిశీలించిన కమిషనర్



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు

ఆర్మూర్‌టౌన్,మార్చి29(ఆంధ్రజ్యోతి):మున్సిపల్ పరిధిలోని ఈద్గాలు, మందిరాల వద్ద జరుగుతున్న పనులను మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు.రంజాన్ పర్వదినంను పురస్కరించుకొని ఈద్గాల వద్ద చేపట్టిన పనులను అలాగే ఉగాది పండుగను పురస్కరించుకొని పెర్కిట్‌లోని వెంకటేశ్వర స్వామి మందిరం, మామిడిపల్లిలోని హనుమాన్ మందిరంలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్ తదితరులు పాల్గొన్నారు.

●హెల్త్ సెంటర్ భవన పనుల పరిశీలన

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి 9వ వార్డులో అర్బన్ ప్రైమరి హెల్త్ సెంటర్ భవన నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. 15వ ఆర్థిక సంఘం హెల్త్ గ్రాంట్స్ నిధులు కోటి 43లక్షల గ్రాంటుతో చేపడుతున్న భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను కోరారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

భీమగల్ టౌన్, మార్చి29(ఆంధ్రజ్యోతి): గిరిజనుల మాతృభాష గోర్ బులి భాషను రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యుల్లో చేర్చాలని పోరాటం పై నిన్న అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి తీర్మానించడం పై హర్షం వ్యక్తం చేస్తు మండల బంజారా లు శనివారం పట్టణ కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, లంబాడి హక్కుల పోరాట సమితి నాయకుడు తేజ నాయక్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో లంబాడి పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చౌహాన్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్య రమేష్ నాయక్, భీంగల్ మండల అధ్యక్షుడు సేవాలాల్ నాయక్, నియోజకవర్గ ఇంచార్జి వలినాయక్, బంజార సీనియర్ నాయకులు మలవత్ సంగ్య నాయక్, మండల నాయకులు భూక్య గణేష్, మలావత్ విజేంధర్ నాయక, విజయ్, సంతోష్, తులసిరాం నాయక్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ సంత వేలం

ముప్కాల్, మార్చి29(ఆంధ్రజ్యోతి):బాల్కొండ మండల కేంద్రంలో శనివారం 2025-26 వారపు సంతకు వేలం నిర్వహించగా మహ్మద్ మెయినోద్దిన్ రూ.4లక్షల 80వేలకు పాడి వారపు సంతను దకించుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి రజినీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

మహారాష్ట్రలోని మార్కెట్ యార్డు సందర్శన



నాందేడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీని సందర్శిస్తున్న ఆర్మూర్ ఏఎంసీ సభ్యులు

ఆర్మూర్‌టౌన్, మార్చి29(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర రాష్ట్రంలోని నాందేడ్‌లతో పాటు పలు వ్యవసాయ మార్కెట్‌లను శనివారం వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు సందర్శించారు. స్టడి టూర్‌లో భాగంగా మార్కెట్ కమిటీ సభ్యులు మహారాష్ట్రలోని వ్యవసాయ మార్కెట్‌లను సందర్శించి రైతులకు ఏవిధంగా సహాయపడుతున్నారో వారికి అందిస్తున్న సేవల గురించి అక్కడి వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ సాయిబాబాగౌడ్, కమిటి సభ్యులు పాల్గొన్నారు.



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

సుభాష్‌నగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం పరిధిలో అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన పలువురు పేదలకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ శనివారం 130 మంది లబ్ధిదారులకు అందజేశారు. మొత్తం రూ.32,36,500ల రూపాయల చెక్కులను అందజేసినట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలో వందలాది మంది పేదలకు వైద్య సేవల కోసం సీఎం సహాయనిధి ద్వారా చెక్కులు అందించినట్లు తెలిపారు. లబ్ధిదారులకు భారం కాకుండా చెక్కుల జారీ విషయంలో జాప్యం జరగకుండా దరఖాస్తు చేసుకున్న నెలలోపు వచ్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అలాగే దరఖాస్తు చేసుకున్న మొత్తంలో 50 శాతం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులో చెలరేగిన మంటలు



ఉదయం పూట డంపింగ్ యార్డు మొత్తం పొగతో నిండుకున్న దృశ్యం

సుభాష్‌నగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): నగర శివారు లోని నాగారంలో గల డంపింగ్ యార్డులో మంటలు ఎగిసిపడ్డా యి. శుక్రవారం రాత్రి సమ యంలో మంటలు చెలరేగాయి. డంపింగ్ యార్డులో ప్లాస్టిక్, చెత్త ఎక్కువగా ఉండడంతో ఒక్క సారిగా ఎండవేడిమికి మంటలు చెలరేగాయి. స్పందించిన డంపింగ్‌యార్డు సిబ్బంది ఫైర్ స్టేషన్ ఫోన్‌చేసి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పే ప్రయత్నం చేసారు. ఉదయం వరకు మంటలు చెలరేగాయి. ఆ ప్రాంతమంత దట్టమైన పొగతో నిండిపోయింది. ఎండ వేడిమి వల్లనే ప్లాస్టిక్ చెత్త అంటుకుని మంటలు చెలరేగాయని అధికారులు చెబుతున్నారు.

ఉచిత శిక్షణ కోసం దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్సీ మరియు మైనార్టీ యువకులకు స్పార్క్స్ రూరల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే టెలీ హెల్త్ సర్వీసెస్ కోఆర్డినేటర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కోర్సులకు ఉచిత శిక్షణ కొరకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సాయాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణ, భోజన వసతితో పాటు ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని హైదరాబాద్‌లో నిర్వహించే శిక్షణ కోసం ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణతతో పాటు 18-30 సంవత్సరాల వయస్సు కలిగిన యువకులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఎస్సెస్సీ, ఇంటర్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలతో జిల్లా కలెక్టరేట్‌లోని రూమ్ నెంబర్ 113లో గల డీఆర్‌డీఏ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

భూకబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

ఖిల్లా, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తమ భూమిని కబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మల్లారం రైతులు నూడా చైర్మన్ కేశ వేణుకు వినతి సమర్పిం చారు. శనివారం ఆయన చాంబర్‌లో రైతులతో జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు, చంద్రకాంత్, శేఖర్‌లు కలిసి భూమికి సంబంధించిన వివరాల ను వివరించారు. రూరల్ మండలం మల్లారం గ్రామ పంచాయతీ పరిధిలోని 423/28 సర్వే నెంబర్‌లో గల భూమిని 60ఏళ్లకు పైగా మల్లారం గ్రామానికి చెందిన గుండు బడ్డ గంగారాం, శ్రీనివాసులు వ్యవసాయం చేసుకుంటున్నారన్నారు. మూడేళ్ల క్రితం గ్రామానికి సంబంధం లేని వ్యక్తి భూమిని కబ్జా చేయాలని కుట్ర చేస్తున్నారని వివరించారు.

విద్యుత్ అధికారుల తీరు మారాలి

సుభాష్‌నగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అధికారుల తీరు మారాలని సీఐటీయూ నాయకురాలు నూర్జహాన్ అన్నారు. సీఐటీయూ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతి సబ్ స్టేషన్‌లో నలుగురు ఆపరేటర్లు, ఒక వాచ్‌మెన్ ఉండాలన్నారు. ప్రస్తుతం ఇద్దరు లేదా ముగ్గురితోనే విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. కార్మికులకు కావాల్సిన అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ జనరల్ సెక్రెటరీ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

మల్లాపూర్‌లో భూ వివాదం

● పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన గ్రామస్థులు

ఇందల్వాయి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ శివారులోని అసైన్డ్‌భూమి కొన్నేళ్లుగా వివాదాలకు దారి తీస్తుంది. ఆ భూమి మల్లాపూర్‌కు చెందిందని మల్లాపూర్ గ్రామస్థులు అంటుండగా ఆ భూమి నాదేనని రాంపూర్ గ్రామానికి చెందిన మరొకరు అంటున్నా రు. ఇరువర్గాలకు చెందిన భూమి సరిహద్దులను రాంపూర్ గ్రామా నికి చెందిన వ్యక్తి హద్దులను తీసియవేయడంతో మల్లాపూర్ గ్రామ స్థులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మల్లాపూర్ గ్రామ శివారులోని 262, 263 సర్వే నెంబర్‌లో మూడు ఎకరాల అసైన్డ్ మెం ట్ భూమిని మల్లాపూర్ గ్రామస్థులు వడ్ల కల్లాల కోసం ఉప యోగిస్తున్నారు. ఆ భూమి పక్కనే రాంపూర్ గ్రామానికి చెందిన షేర్‌ఖాన్ అదే సర్వేలో మూడు ఎకరాల భూమిని కొనుగోలు చేశాడు. తాను కొనుగోలు చేసిన భూమి పక్కనే అసైన్డ్ భూమి ఖాళీగా ఉందన్న సాకుతో మరో మూడు ఎకరాల భూమిని ఆక్రమించే ప్రయత్నం చేశాడు. ఈ విషయం తెలుసుకున్న మల్లాపూర్ గ్రామస్థులు అడ్డుకున్నారు. మూడేళ్ల క్రితమే మల్లాపూర్ గ్రామస్థులు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేయగా ఆర్‌డీవో, ఎంఆర్‌వోలు ఆ స్థలానికి చేరుకొని సర్వే నిర్వహించి ఎవరి స్థలంలో వారు ఉండాలని చెప్పి హద్దులు చూపించారు. అంతటితో సర్దుమనిగిన భూ వివాదం మళ్లీ శనివారం తెరలేపింది. రాంపూర్ గ్రామానికి చెందిన షేర్ ఖాన్ శనివారం మల్లాపూర్ గ్రామానికి చెందిన భూమి సరిహద్దులను తీసివేసి రాళ్లను పగలగొట్టి భూమిని కబ్జాచేసే ప్రయత్నం చేశాడు. విషయం తెలుసుకున్న మల్లాపూర్ గ్రామస్థులు అడ్డుకునే ప్రయత్నం చేసిన వినలేదు. దీంతో పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు వచ్చి గొడవను సర్దుమనిగించారు. మూడేళ్ల క్రితం ఆర్‌డీవోలు, ఎం ఆర్‌వోలు వచ్చి ఇద్దరి మధ్య భూమి సరిహద్దులు చూపించిన ప్రతీ సారి షేర్‌ఖాన్ భూకబ్జాలు చేయడం సరైందికాదని మల్లాపూర్ గ్రా మస్థులు శనివారం ఇందల్వాయి ఎస్సై మనోజ్‌కుమార్‌కు లిఖిత పూ ర్వకంగా ఫిర్యాదు చేశారు. 262, 263 సర్వేలో మల్లాపూర్ గ్రామానికి చెందిన మూడు ఎకరాల భూమిని కబ్జా చేస్తున్న రాంపూర్ వాసి షేర్ ఖాన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో చాకలి సత్యలింబాద్రి, తోట ప్రకాశ్, నారాయణ, దాకారం గంగాధర్, సురేష్, ధర్మారం సాయన్న, కుమ్మరి నర్సయ్య, సంగు పోశెట్టి, సత్యనారాయణ, గ్రామస్థులు ఉన్నారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న మల్లాపూర్ గ్రామస్థులు

ఎరువుల సబ్సిడీని కొనసాగించిన కేంద్రం

సుభాష్‌నగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైతులకు ఉపయోగ పడే విధంగా నిర్ణయం తీసుకుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి అన్నా రు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటనను శనివారం విడుదల చేశారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో వచ్చే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పొటాష్, పాస్పెట్ ఎరువులకు సబ్సిడీ కొనసాగించాలని నిర్ణయం తీసుకుందన్నారు. గత ఏడాదితో పోలిస్తే సబ్సిడీ 50 శాతం పెరిగిందన్నారు. రైతులకు తక్కువ ధరకే ఎరువులు అందుబాటులో ఉంటాయని అన్నారు. 50 కేజీల యూరియా బస్తా ధర 2450 ఉంటే సబ్సిడీ 2183 తీసివేస్తూ కేవలం 266 రూపాయలకే యూరియా బస్తాను అందిస్తున్నారని తెలిపారు. ఇదే విధంగా డీఏపి ఇతర ఎరువులకు కూడా సబ్సిడీని అందిస్తున్నారని ఆయన తెలిపారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద మూడు విడతల్లో రైతులకు 6వేల రూపాయలను పెట్టుబడి కోసం అందిస్తున్నారని ఆయన తెలిపారు.

దీర్ఘకాలిక రుణాలను వెంటనే చెల్లించాలి

● నల్లవెల్లి మహాజన సభలో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

ఇందల్వాయి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): నల్లవెల్లి సొసైటీ పరిధిలో గల గ్రామాల్లో దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న రైతులు వెంటనే రుణాలను చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకారం అందించాలని సొసైటీ చైర్మన్ నోముల శ్రీనివాస్‌రెడ్డి రైతులకు సూచించారు. శనివారం మండలంలోని నల్లవెల్లి గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో ఆరు నెలల మహాజన సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సన్నాలకు రూ.500ల బోనస్, రైతురుణమాఫీ లాంటి అనేక సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టింద న్నారు. సొసైటీ పరిధిలో స్వల్పకాలిక రుణాలను 243 మందికి 235.79 కోట్లు దీర్ఘకాలిక రుణాలను 13 మందికి 83.75 లక్షలు, బంగారు ఆభరణాలపై 97 మందికి 84.96 లక్షలు రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. నాలుగు విడతల్లో 40 మం దికి 27.20లక్షల రుణమాఫీ వచ్చిందన్నారు. గత సంవత్సరం కంటే ఈయేడాది ఎక్కువ ధాన్యం రైతులు కొనుగోలు కేంద్రాలలో అమ్మా లని సొసైటీ పరిధిలోగల రైతులు ధాన్యాన్ని సొసైటీకి అమ్మి సొసైటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ నోముల శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ రమేష్, డైరెక్టర్లు పూదారి మనోహర్, పిప్పెర మురళి, కన్నె జానకవ్వ, శశిధర్‌రెడ్డి, వెల్మల గంగాధర్, కాట్రోత్ బాబురావు, పల్లె భూమయ్య, నల్లవెల్లి రవీందర్, సీఈవో తేజాగౌడ్, కోశాధికారి పిప్పెర చిన్నరాజన్న, సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు

నిజామాబాద్ కల్చరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శనివారం అమావాస్య పూజలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సంవత్సరంలో చివరి రోజు కావడంతో భక్తులు శనిదేవుడికి విశేష పూజలు నిర్వహించారు. అమావాస్య శనివారం రెండు కలిసి అరుదుగా ఉండడంతో భక్తులు శనిదేవునికి పూజలు నిర్వహించడంతో పాటు అన్నప్రసాదాలు జరిపారు.

అనారోగ్యంతో పదో తరగతి విద్యార్థి మృతి



శ్రీహర్ష(ఫైల్)

ఇందల్వాయి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నారం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న లక్కుంట్ల వడ్ల శ్రీహర్ష (15) చికిత్స పొందుతూ శనివారం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో మృతి చెందినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గాయత్రీ తెలిపారు. ఆరోగ్యం బాగాలేకున్నా పదవ తరగతి పరీక్షలు రాశాడని అనంతరం అనారోగ్యానికి గురికావడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఆ పాఠశాల విద్యార్థి అకాల మరణం చెందడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గాయత్రీ, ఉపాధ్యాయ సిబ్బంది, తోటి విద్యార్థులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అనంతరం తన ఆత్మకు శాంతిచేకూరాలని సానుభూతి వ్యక్తం చేశారు.

జిల్లా కేంద్ర ఆసుపత్రిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

నిజామాబాద్ అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఒకటవ టౌన్ ఎస్సై రఘుపతి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో లిఫ్ట్ ఎదురుగా 40-45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి నలుపురంగు షర్ట్, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడని అపస్మారక స్థితిలో పడిపోయి ఉన్నందున అతన్ని వైద్యం కొరకు తరలించగా అప్పటికే మృతి చెందిఉన్నట్లు వైద్యులు ధృవీకరించినట్లు ఎస్సై తెలిపారు. లేబర్ పనిచేసుకునే వ్యక్తిగా అనుమానిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఇతనికి సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిస్తే 1వ టౌన్ పోలీస్ స్టేషన్‌లో లేదా 87126 59714 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

మహిళను హత్య చేసిన వ్యక్తి అరెస్టు

ఖిల్లా, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళను హత్యచేసిన రాజేష్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సౌత్ రూరల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపారు. తల్లిని అసాంఘీక కార్యకలాపాలకు ఉసిగొల్పు తుందని కక్షను పెంచుకున్న రాజేష్ కమల అనే మహిళను గురువారం నగర శివారులోని బైపాస్ నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి బండరాయితో మోది హత్య చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఆ హత్యనుంచి బయటపడేందుకు ఎవరికి అనుమానం రాకుండా శుక్రవారం కారు అద్దెకు తీసుకుని అందులో మృతదేహాన్ని డిక్కీ లో వేసి ఆర్మూర్ వైపు గల దాస్‌నగర్ వద్ద ఉన్న నిజాంసాగర్ కెనాల్‌లో పడేసేం దుకు యత్నిస్తుండగా వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీస్ సిబ్బంది అనుమానంతో కారును వెంబడించి డిక్కీలో మృతదేహాన్ని గుర్తించారు. కేసు దర్యాప్తు చేసిన రూరల్ పోలీసులు రాజేష్ నేరం అంగీకరించడం వల్ల అతన్ని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపారు.



మాట్లాడుతున్న చంద్రు నాయక్

'గోర్‌భోలి భాషను రాజ్యాంగంలో చేర్చేలా తీర్మానం చేయడం హర్షనీయం'

నిజామాబాద్ అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): బంజారా లాంబాడాల మాతృభాషా గోర్‌భోలిని రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని శాసనసభలో సీఎం తీర్మానం చేయించడం సంతోషకరమని, ఇది చరిత్రలో నిలిచిపోయే నిర్ణయమని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ జిల్లా అధ్యక్షుడు బుక్య చంద్రునాయక్ అన్నారు. శనివారం నిజామాబాద్‌లోని జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లంబాడాలు గత కొన్నేళ్లుగా ఎదురుచూస్తున్న తమ మాతృభాషా గోర్‌భోలిని రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేయడం హర్షనీయమన్నారు. దేశంలో హిందీభాషా తర్వాత తమ భాష గోర్‌భోలి మాట్లాడే సంఖ్యఎక్కువగా ఉందని, అంతటి ప్రాముఖ్యత ఉన్న భాషను ఇప్పటికైనా ప్రభుత్వాలు రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చి తమ భాషకు గౌరవం తీసుకురావాలన్నారు. తమకు మద్దతుగా నిలిచిన సీఎం రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి బంజారాలు ఎప్పటికీ రుణపడి ఉంటారని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తుకారాం నాయక్, శివాజీ నాయక్, రామారావు చౌహాన్, లాల్‌సింగ్, మంగత్య నాయక్, రమేష్ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: లంబాడాల మాతృభాష గోర్‌భోలి భాషను రాజ్యంగంలోని 8వ షెడ్యూల్లో చేర్చాలని కాంగ్రెస్ ప్రభుత్వం శాసన సభలో తీర్మానించడం చారిత్రాత్మకమని కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ రూరల్ కోర్డినేటర్ మాజీ ఐఆర్‌ఎస్ అధికారి జరుపుల గోవింద్ ఒక పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. లంబాడాల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ మాత్రమే పని చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలుపడంతో ఏకగ్రీవంగా ఆమోదం పొందడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. పార్లమెంటులో కేంద్రం ప్రభుత్వం ఆమోదం పొందేల బీజేపీ ఎంపీలు ఒత్తిడి తేవాలని కోరారు.

మార్వాడి యువమంచ్ అధ్యక్షుడిగా సందీప్

నిజామాబాద్ అర్బన్, మార్చి29 (ఆంధ్రజ్యోతి): మార్వడి యువ మంచ్ నిజామాబాద్ శాఖ అధ్యక్షుడిగా సందీప్‌జీ సర్దా ఎన్నికయ్యారు. ఈ మేరకు మాజీ అధ్యక్షుడు వినయ్‌జి సోని, జితేందర్‌జి మలానీల పర్యవేక్షణలో ఏకగ్రీవంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సందీప్‌జీ సర్దా, ఉపాధ్యక్షుడుగా డాక్టర్ అంకిత్‌జి అగర్వాల్, మంత్రిగా కృష్ణజి, ఉపమంత్రిగా రమేష్‌జి, కోశాధికారిగా సందీప్‌జి, సంస్థాగత ప్రచార మంత్రిగా కృష్ణజి ఉపాధ్యాయ్‌లు ఎన్నికయ్యారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గం మాట్లాడుతూ మార్వడిల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

గిరిరాజ్ కళాశాలలో పీడీఎస్‌యూ ధర్నా

నిజామాబాద్ అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో పరీక్ష ఫీజు తగ్గించాలని శనివారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కళాశాలలో రెగ్యూలర్ మరియు బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజులను తగ్గించాలని కోరారు. పేద విద్యార్థులు చదివే గిరిరాజ్ కళాశాలలో పరీక్ష ఫీజులు ఇష్టారీతిన పెంచడం సరైంది కాదని విద్యార్థులు అప్పులు చేసి ఫీజులు కడుతున్నారని కావున వెంటనే ఫీజులను తగ్గించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జన్నారపు రాజేశ్వర్, మనోజ్, విజయ్, సురేష్, జీవన్, వివేక్ పాల్గొన్నారు.

ధర్పల్లిలో ఐకేపీ కొనుగోలు కేంద్రం మంజూరు

ధర్పల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఉత్తర్వులు వెలువడనున్నట్లు తెలిసింది. ఇంతకుముందు ఐడిసిఎంఎస్ ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం ఈసారి చేయడం లే దన్నారు. ఇకనై మండల కేంద్రంలో ధర్పల్లి సింగిల్ విండో ఆధ్వర్యంతో పాటు ఐకేపీ ఆధ్వర్యంలో సైతం వరి ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నారు. ఐకేపీ కొనుగోలు కేంద్రం పసుపు పరిశోధన కేంద్రంలో ఏర్పాటు చేయనున్నట్లు ఐకేపీ అధికారులు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. త్వరలోనే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

31న రాజ్యాధికార సాధన జేఏసీ ఆవిర్భావ దినోత్సవం

సుభాష్‌నగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా బీసీ నాయకులు, ధర్మసమాజ్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మహిపాల్ మాట్లాడుతూ తెలంగాణలో సామాజిక న్యాయం కోసం ఈనెల 31న హైదరాబాద్‌లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ రైట్స్ అండ్ రాజ్యాధికార సాధన జేఏసీ నూతన వేదిక ఆవిర్భావం ఉంటుందని అన్నారు. శనివారం దీనికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంఘం నాయకులు సాగర్, చారి, మేధారి భూమేష్, జిల్లా డీఎస్‌పీ నాయకులు రమేష్, కిషన్, మహిపాల్, పోచయ్య పాల్గొన్నారు.

'బల్మూరి వెంకట్ నిజాయితీని నిరూపించుకోవాలి'

సుభాష్‌నగర్, మార్చి29 (ఆంధ్రజ్యోతి): బల్మూరి వెంకట్‌ని గ్రామంలో తన నిజాయితీని నిరూపించుకోవాలని తెలంగాణ జాగృతి నాయకులు అవంతిరావు అన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మల్యాల మండలం మానాల గ్రామంలో దళితులు, ఇతరుల భూములు లాక్కున్నారని ఎదురిస్తే బస్సుల్లో, ఎన్‌ఎస్‌యూఐ కార్యకర్తలను జగిత్యాల జిల్లా మల్యాల మండలం మానాల గ్రామంలో దాడులకు పాల్పడ్డారని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పులిజైపాల్, శ్యామల సాయికృష్ణ, పంచరెడ్డి మురళి, సరిత, హరీష్, సంపత్, ఆకాష్, సందీప్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్ నగరంలోని నెహ్రూపార్క్‌లో సందడి





ఫొటో న్యూస్

సందడిగా మారిన నెహ్రూపార్క్

రంజాన్ పండుగ దగ్గర పడటంతో జిల్లా కేంద్రంలోని బోధన్ రోడ్ అంతా క్రయ విక్రయాలతో సందడిగా మారింది. నెహ్రూ పార్క్ నుంచి బడాబజార్ రోడ్, బోధన్ రోడ్, శంభుని గుడి, హైమదీ బజార్ రోడ్ ఇరువైపులా, రోడ్లపైనే దుకాణాలు వెలిశాయి. ఉదయం నుంచి తెల్లవారుజాముని వరకు వ్యాపారాలు కొనసాగుతున్నాయి. సెంట్, అత్తరులు, మహిళలకు సంబంధించి గాజులు, మెహిందీ, వస్త్రాలు, పండుగ రోజు ప్రత్యేకంగా చేసుకునే స్వీట్ ఖీర్ కుర్మాకు అవసరమైన సేమీలు, డ్రైఫ్రూట్స్ కొనేందుకు మహిళలు మార్కెట్‌కు వస్తున్నారు. అర్ధరాత్రి వరకు వ్యాపారాలు కొనసాగుతుండడంతో నెహ్రూపార్క్ సందడిగా మారింది. ● (ఆంధ్రజ్యోతి, నిజామాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్)





గాజులు కొనుగోలు చేస్తున్న మహిళలు

డ్రైఫ్రూట్స్ కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

సేమియాలు

నూతన వస్త్రాలు కొనుగోలు చేస్తున్న మహిళలు

ఉగాది పండుగకు సర్వం సిద్ధం



షడ్రుచుల తయారీకి కొత్త కుండలు

మద్నూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : తెలుగు కొత్త సంవత్సరాది ఉగాది పండుగకు సర్వం సిద్ధమైంది. పండుగ రోజు చేసుకునే షడ్రుచుల పచ్చడి కోసం కొత్త కుండలు, మామిడికాయలు, వేప పువ్వు శనివారం సాయంత్రానికి సిద్ధం చేసుకున్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ మామిడికాయలు కొత్త కుండలు, పూలు, పండ్ల వ్యాపారులతో సందడిగా కనిపించింది. వ్యాపారులు మామిడికాయలు, పండ్లు, పూలు విక్రయిస్తుండగా కుమ్మరులు కొత్త కుండలను విక్రయానికి తీసుకొచ్చారు. గత ఏడాది కంటే ఈఏడాది ధరలన్నీ అధిక రేట్లతో ఉన్నట్లు ప్రజలు పేర్కొంటున్నారు.

● ఉగాది ప్రాముఖ్యత

భారతదేశంలో ఉగాది పర్వదినానికి ప్రాధాన్యత ఉందని ప్రముఖ కవులు చెబుతుంటారు. తీపి, చేదు, వగరు కలయికే ఉగాది పండుగ ప్రత్యేకత అని అంటారు. ఉగాది నుంచే తెలుగు సంవత్సరం ప్రారంభమవుతుంది. ఇంగ్లీష్ నెల జనవరి నుంచి ప్రారంభం కాగా తెలుగు సంవత్సరము ఉగాది నుంచే ప్రారంభం అవుతుంది ఉగాది నుంచి తెలుగువారు కొత్త వ్యాపారులు ప్రారంభించడం సాంప్రదాయంగా భావిస్తారు. సాంప్రదాయం ప్రకారం గుడిపాడవగా ఈ పండుగను జరుపుకుంటారు. ఉగాది పర్వదినం సందర్భంగా ఆర్య సమాజ్‌లో హోమం, ఆర్‌ఎస్ఎస్ ఆధ్వర్యంలో పచ్చడి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.దేవాలయాల్లో పండితులు పంచాంగ శ్రవణ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

కోర్టు ఆర్డర్ ఉన్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు



భూమికి సంబంధించిన కాగితాలు చూపుతున్న బాధితులు

కామారెడ్డిటౌన్,మార్చి 29(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 2వ వార్డు రామేశ్వర్‌పల్లి గ్రామశివారులో చిదుగు హేమలత, బుర్ర జ్యోతికి సంబంధించిన మూడుఎకరాల భూమి ఉందని చిదుగు రమేష్ గౌడ్ తెలిపారు.ఈ భూమి పక్కన సర్వేనంబర్ 85లో నిర్మల సొసైటి ఆఫ్‌ది ఫ్రాన్స్ సిస్టర్ జీవదాన్ కాన్వెంట్ వారు 1 ఎకరం 28 గుంటల భూమిని కబ్జాచేసి ప్రహరి గోడ నిర్మిస్తున్నారని ఆరోపించారు.ఈ విషయంపై ఆర్‌డీఓ, తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయంలోని టీపీఓకు ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. సర్వేయర్‌కు సర్వే చేయించుకోవడం కోసం దరఖాస్తుచేసుకుని రిపోర్టు ఇవ్వడం లేదని,కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. పనులు నిలిపివేయాలని కోర్టు నుండి స్టే ఆర్డర్ కాపి తీసుకురావడం జరిగిందని ఇప్పటికైన కలెక్టర్ స్పందించి తమకు న్యాయం చేయాలని రమేష్‌గౌడ్ కోరారు.

ఎల్లారెడ్డిపేటలో ట్రాక్టర్ల పట్టివేత



ఇసుక ట్రాక్టర్‌లను పట్టుకున్న ఫారెస్ట్ అధికారులు

రాజంపేట,మార్చి 29(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామశివారులో బీటీ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్‌లను శనివారం పట్టుకున్నట్లు ఎఫ్ఆర్ఓ రమేష్ తెలిపారు. మెదక్ జిల్లాకు సంబంధించిన ట్రాక్టర్‌లు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న సమాచారంతో దాడులుచేసి పట్టుకుని రాజంపేట పోలీసుస్టేషన్‌కు తరలించామని తెలిపారు. ఎవరైన అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో సెక్షన్ అధికారి బాబా, సలీం,బిట్ అధికారులు శ్రీనివాస్, సురేష్,పద్మారావు పాల్గొన్నారు.

కవులు సాంస్కృతిక వారధులు

కామారెడ్డిటౌన్,మార్చి 29(ఆంధ్రజ్యోతి): కవులు సాంస్కృతిక వారధులని తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ వి.శంకర్ అన్నారు. శనివారం స్థానిక విజన్ జూనియర్ కళాశాలలో ఉగాది కవి సమ్మేళనంను సీనియర్‌కవి సిరిగాధ శంకర్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవులు విభిన్న సంస్కృతులకు వారసులని సాహిత్యం ద్వారానే సమాజంలో సమైక్యత సామరస్యత నెలకొంటుందని తెలిపారు. మానవ సంస్కారం ప్రబోధించేలా తెలంగాణ అస్థిత్వ చైతన్యాన్ని ప్రతిబింబించేలా రచనలుచేయాలన్నారు. సమాజాన్ని నిజాయితీగా నిలబెట్టడానికి కృషిచేసేవాడే కవి అన్నారు.ఈ కార్యక్రమంలో తెరాస రాష్ట్రకార్యదర్శి ప్రకాశ్, కవులు అశోక్‌కుమార్,తిరుమలకైలాస్ వి.రమేష్, రామకోటి, నర్సింలు, కులకర్ణి పూర్ణచంద్రరావు, మారుతి, పార్వతి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమయానికి ముందే పరీక్షా పేపర్లను తీసుకున్న ఇన్విజిలేటర్లపై చర్యలు తీసుకోవాలి

● టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు సంజయ్

భిక్కనూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన పరిక్షలో బాగంగా 15 నిముషాల ముందే విద్యార్థుల నుండి ఇన్విజిలేటర్లు పరిక్షా పేపర్లను తీసుకోవడం ఎంత వరకు సమంజసమని టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు గంధం సంజయ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ పరిక్ష సమయం కాకముందే నాల్గవ నెంబర్ గదిలో విద్యార్థుల నుంచి పరిక్ష పేపర్లను తీసుకున్న ఇన్విజి లేటరపై అధికారులు వెంటనే చర్యలు తీసుకుని విద్యార్థులకు తగు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంల టీజీవీపీ నియోజకవర్గ ఇంచార్జి సమీర్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

లెక్చరర్‌కు ఉగాది పురస్కారం

దోమకొండ, మార్చి 29(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్న ఉమాశేషారావును కామారెడ్డిలో శనివారం వశిష్ట డిగ్రీ కళాశాలలో ఉగాది సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనంలో సంస్కార భారతి కార్యక్రమం నిర్వహించారు. కుటుంబ వ్యవస్థ,నాగరికత విలువలపైఉత్తమ కవిత వినిపించినందుకు సంస్థ ప్రతినిధులు సమ్మిరెడ్డి,సత్యప్రసాద్ సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్‌గా సంతోష్

బీర్కూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్‌గా బీర్కూర్‌కు చెందిన కొట్టూరి సంతోష్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం బీర్కూర్ మండల కేంద్రంలోని లయన్స్ క్లబ్ భవనం ఆవరణలో నూతన జోన్ చైర్మన్ సంతోష్‌కుమార్‌ను శాలువాలతో సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ బీర్కూర్ మండల అధ్యక్షుడు మేకల గాలయ్య, కార్యదర్శి రవీందర్ సర్‌జెట్టి, లయన్స్ క్లబ్ సీనియర్లు మేకల విఠల్, అరిగే శ్రీనివాస్, ద్రోణవల్లి కిషోర్, రాచప్ప, ట్రెజరర్ సీతాలే రమేష్, భూషణం, అశోక్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాలబైరవ స్వామి ఆలయంలో ఎమ్మెల్సీ కవిత పూజలు

రామారెడ్డి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రం - ఇసన్నపల్లి గ్రామాల మధ్య వెలసిన శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని గతంలో మొక్కిన కోర్కెలు నెరవేర్చాలని భారీ బందోబస్తు ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ నేతృత్వంలో ఆలయ పురోహితులు శ్రీనివాస్ శర్మ, మనీష్ శర్మ మంత్రం మధ్య ఆలయానికి స్వాగతం పలికారు. పండితుల మంత్రోచ్చారణతో ఆలయ గర్భగుడిలో పలభిషేకం,సింధూర,పూజలు ప్రత్యేక పూజలు నిర్వహిం చా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ అనతి కాలంలోనే ఎంతో అభివృద్ధి చెందిన శ్రీకాలభైరవ స్వామి ఆలయాన్ని దర్శించు కోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. మానసిక ప్రశాంతత కోసం, మొక్కిన కోర్కెలు నెరవేరాలని భైరవుని దర్శనం నాకు చాలా సంతోషం వ్యక్తం చేస్తుందని పేర్కొన్నారు. శ్రీ కాలభైరవ స్వామి ఆలయ సూపరింటెండెంట్ బుర్ర ప్రభురాంచంద్రం గుప్తా ఆధ్వర్యంలో కాలభైరవ స్వామి చిత్రాలను అందజేసి ఘనంగా సన్మానించారు. అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని అంతకుముందు 105 దీపారాధన నిర్వహించారు. ఆలయ విశిష్టత, అభివృద్ధి గురించి రాచర్ల శ్రీనివాస్ శర్మ వివరించారు. పంతులు భార్య రాచర్ల రాధిక, కుమార్తె భవానీలను కలిసి ఎమ్మెల్సీ కలుగుండ్ల కవిత సంతోషం వ్యక్తం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి నేతృత్వంలో రామారెడ్డి నరేష్ పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, మాజీ ఎంపీపీ నారెడ్డి దశరత్ రెడ్డి, మాజీ జడ్పిటిసిలు పడిగేల రాజేశ్వర్ రావు, మనోహర్ రెడ్డి, ఆర్యవైశ్య సత్రం చైర్మన్ గంజీ సతీష్ గుప్తా, బీఆర్ఎస్ మండల నాయకులు నారాయణరెడ్డి, కాసర్ల రాజేందర్, పడిగేల శ్రీనివాస్ గుప్తా, లచ్చిరెడ్డి నాయక్, ఇతర ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, రాజకీయ నాయకులు, వ్యాపారులు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పరిహాసంగా మారుతున్న ప్రజాధనం

● లక్షలు ఖర్చుచేసినా ఉపయోగంలో లేని నిర్మాణాలు
● నిర్మాణంలో చూపిన ఉత్సాహం వినియోగంలో చూపలేకపోతున్న అధికారులు

సదాశివనగర్,మార్చి 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు ప్రజా అవసరాల కోసం పథకాలు, అభివృద్ధి పనులు తీసుకువస్తున్నామని చెప్పుకుంటున్నారే తప్ప వాటిని పూర్తిస్థాయిలో అమలు అయ్యేలా చూడడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మండలంలో నిర్మించిన స్మశానవాటికలు, క్రీడాప్రాంగణాలు చూస్తేనే ఈ విమర్శలకు బలం చేకురుతుంది. గత ప్రభుత్వం గ్రామాలలో ప్రజలు చనిపోయిన అంత్యక్రియలు జరపడానికి స్థలాలు లేకపోవడంతో గ్రామాలలోని అసైన్‌మెంట్ భూములను గుర్తించి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఒక్కో గ్రామంలో 13లక్షల వరకు వెచ్చించారు. ఈ నిధులతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వైకుంఠధామాల పేరుతో నిర్మాణాలు చేపట్టారు. కొన్ని గ్రామాలలో స్థానిక సర్పంచ్‌లు,చిన్నచితక కాంట్రాక్టర్‌లు,పార్టీ కార్యకర్తలు కలిసి నిర్మాణాలు చేపట్టారు.మండలంలోని 24 గ్రామపంచాయతీలలో మొత్తం 3.50 కోట్ల వరకు ఖర్చుచేసి పనులు వేగంగా చేయాలని నిత్యంకాంట్రాక్టర్‌లకు సూచించిన అధికారులు నిర్మించిన పనులు వినియోగంలో ఉన్నాయా లేదా అనేది మారిచారు. 80శాతం గ్రామాలలో నిర్మించిన స్మశానవాటికలు అందుబాటులోకి తీసుకురాకపోవడంతో నిధులు బూడిదలో పోసిన పన్నీరుల మారింది.ఒక ప్రభుత్వం చేపట్టిన పనులను మరో ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ప్రభుత్వాలు మారితే ప్రజాఅవసరాలను విస్మరిస్తున్నారని దీంతో ప్రజాధనం వృదాపోతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వాలలో దొర్లిన తప్పులను సరిచేసి వాటిని ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రస్తుత ప్రభుత్వాలు కృషిచేస్తే ప్రజలకు మేలు జరుగుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



తిమ్మజీవాడిలో నిరుపయోగంగా ఉన్న క్రీడాప్రాంగణం

ఆర్థిక సాయం అందజేత

రామారెడ్డి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా ఫోటోగ్రఫీ యూనియన్ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలో మీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రానికి చెందిన పద్మ దినేష్ అనే వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై మరణించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో శనివారం ఫోటోగ్రఫీ యూనియన్ ఆధ్వర్యంలో బాధితుల కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆసం శ్రీనివాస్, సురేష్‌రావు, గోపాల్‌రెడ్డి, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



పిట్లంలో కల్యాణలక్ష్మి చెక్కుల అందజేస్తున్న దృశ్యం

పిట్లం మార్చి 29(ఆంధ్రజోయతి):స్థానిక మార్కెట్‌కమిటి కార్యాలయంలో శనివారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు హన్మండ్లు అందజెశారు.ఆయన మాట్లాడుతూ ప్రజాప్రభుత్వంలో నిరుపేదలకు సంక్షేమపథకాలు తప్పని సరిగా అందుతాయ న్నారు.కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు 39 మంది లబ్దిదారులకు అందించామన్నారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు బాల్‌రాజ్, తదితరులు పాల్గోన్నారు.

ఓవర్‌లోడ్ ట్రాన్స్‌ఫార్మర్ మార్పు

కామారెడ్డిటౌన్,మార్చి29(ఆంధ్రజ్యోతి):కామారెడ్డిమున్సిపల్ పరిధిలోని టెక్రియాల్‌లో ఓవర్‌లోడ్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్పుచేయించినట్లు మాజీ కౌన్సిలర్ శంకర్‌రావు తెలిపారు. 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా బోర్ మోటార్‌లు కాలిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని వాటిని మార్చాలని అధికారులకు కోరడంతో ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం 63 కేవీ నుంచి 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌గా మంజూరు చేసి బిగించడంతో రైతుల ఇబ్బందులు తొలిగిపోయాయని తెలిపారు.అదేవిధంగా టెక్రియాల్‌లోని రోడ్డు మధ్య భాగంలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో ప్రజలకు ఇబ్బందిగా మారిందని దాని సైతం విద్యుత్ అధికారులు మార్చరని తెలిపారు.ఈ కార్యక్రమంలోవిద్యుత్ సిబ్బంది,గ్రామస్తులు పాల్గొన్నారు.

డీసీఎం వ్యానును ఢీకొని ట్రాలీ ఆటో బోల్తా

భిక్కనూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ముందు వెళ్తున్న ఆటోను డీసీఎం వ్యాను ఢీకొనడంతో ఆటో బోల్తాపడి ఇద్దరికి గాయాలైన సంఘటన భిక్కనూరు శివారులో 44వ జాతీయరహదారిపై శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే రామాయంపేట నుండి భిక్కనూరు వైపు వంట పాత్రలను విక్రయించడానికి తల్లికొడుకు తన ట్రాలీ ఆటోలో వస్తుండగా అదేవైపు వెళ్తున్న డీసీఎం వ్యాను ఢీకొనడంతో ఆటో బోల్తాపడి రోడ్డు కింద పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న మెదక్‌కు చెందిన తల్లి, కొడుకు మంగమ్మ, బన్నీకి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ మేరకు సమాచారం అందుకున్న 108అంబులెన్స్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా ఆటోను ఢీకొన్న డీసీఎం వ్యాను ఆపకుండా వెళ్లిపోగా ఆటోలోని వంటపాత్రలో చెల్లాచెదురుగా పడ్డాయి.



ఆటో బోల్తా పడిన దృశ్యం

సన్న బియ్యం వచ్చేశాయ్...

● దొడ్డు బియ్యం అక్రమాలకు చెక్..

మద్నూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఇన్నాళ్లు దొడ్డు బియ్యం తిన లేక ఇబ్బందులు పడుతూ వాటిని బ్లాక్ మార్కెట్లో విక్రయించిన రేషన్ దారులకు ఇకపై ఆ ఇబ్బందులు తొలగిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం ఉగాది నుంచి రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించింది. పేదలకు ఇచ్చే దొడ్డు బియ్యం పక్క దారి పడుతున్నాయని ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం ఇవ్వడానికి ముందుకు వచ్చింది. ఇందుకోసం గత వానాకాలం సీజన్‌లో రైతుల వద్ద నుంచి సన్న వరి ధాన్యాన్ని పెద్ద ఎత్తున కొనుగోలు చేసింది. వీటిని మరపట్టించి గోదాముల్లో నిలువ చేసి ఉంచారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ఉగాది రోజున ప్రారంభిస్తామని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి వెల్లడించారు. దీంతో ఆయా ఎంఎల్ఎస్ పాయింట్లు నుంచి చౌక ధరల దుకాణాలకు సన్నబియ్యాన్ని లారీల్లో తీసుకొచ్చి అన్‌లోడ్ చేశారు. ఈ బియ్యాన్ని ఏప్రిల్ నెల నుంచి ఇవ్వడానికి అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో 557 రేషన్ దుకాణాల ద్వారా 2.46 లక్షల రేషన్ కార్డుదారులకు 5450 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం సరఫరా చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈపాటికి ఉమ్మడి మద్నూర్ మండలంలోని రేషన్ దుకాణాలకు సన్నబియ్యం చేరుకున్నాయి.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదు

ఎల్లారెడ్డి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని ఎల్లారెడ్డి ఎంపీ ఓ ప్రకాష్ అన్నారు. శనివారం ఎల్లారెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో మండల విద్యాధికారి ఏవి వెంకటేశం పదవి విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖలో ఆయన పనితీరును ఇతర ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. అనంతరం మండలంలోని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ వ్యాపార వేత్త మృతి

మద్నూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన గోవింద ప్రసాద్ (పప్పు సేట్) హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబీకులు వెల్లడించారు. మండల కేంద్రంలో పత్తి మిల్లుతోపాటు పద వ్యాపారాలు చేస్తూ స్వచ్ఛంద కార్యక్రమాల్లో పాల్గొనే వారని గ్రామస్తులు తెలిపారు. చికిత్స పొందు తూ శనివారం సాయంత్రం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు భార్య ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

తాడ్వాయి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసినట్లు మండల అధ్యక్షుడు జూకంటి వెంకట్ రెడ్డి తెలిపారు. తాడ్వాయి మండలంలోని సంగోజీవాడి, చందాపూర్, కరడ్ పల్లి గ్రామాల్లో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మహమ్మద్ షౌకత్ అలీ, ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గైని శివాజీ, మండల యూత్ అధ్యక్షుడు అఖిల్ రావు, కోఆర్డినేషన్ మెంబర్ తిప్పారావు, మోహన్ రెడ్డి, తాడ్వాయి మండల ఎస్సీ సెల్ రాజేందర్, సుధాకర్ రావు, మేకల రాజు, శ్రీకాంత్, సంగోజువాడి గ్రామ అధ్యక్షుడు లింగం చందాపూర్, గ్రామ అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్, మహిపాల్ స్వామి, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు టెంట్లు ఏర్పాటు

దోమకొండ, మార్చి 29(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని గుండ్ల చెరువులో శనివారం ఉపాధిహామీ కూలీలకు టెంట్లు ఏర్పాటు చేసినట్లు ఏపీవో రజని తెలిపారు. కూలీలు పనిచేసే ప్రదేశంలో నీటి సదుపాయం, టెంట్లు,ఫాస్టెడ్ బాక్స్ అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీఎలు రాజేశ్వర్, లింగం, ఏఫ్ఏ లింగం, కూలీలు పాల్గొన్నారు.

దుర్కిలో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

నసురుల్లాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండలం దుర్కి గ్రామంలో జమా మజీద్ ఆవరణలో మజీద్ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లీం సోదరులకు ముందస్తుగా రంజాన్ పండుగ శుభాకాంక్షాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీర్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం శ్యామల, మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, ముస్లీం పాల్గొన్నారు.

మైనార్టీల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తుంది



ఇఫ్తార్‌విందులో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ

కామారెడ్డిటౌన్,మార్చి 29(ఆంధ్రజ్యోతి): మైనార్టీల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అన్నారు. శనివారం టెక్రియాల్‌లో ఏర్పాటుచేసిన ఇఫ్తార్‌విందులో ఆయన పాల్గొని ప్రత్యేక ప్రార్థనలుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం ఇఫ్తార్‌లో పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల,నిరుద్యోగుల సహకారంతో అధికారంలోకి వచ్చిందని తెలిపారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించే దిశగా రాజీవ్‌యువ వికాసం పథకాన్ని అందుబాటులోకి తెచ్చిందని అన్నారు.రేవంత్‌రెడ్డి అన్ని రంగాల్లోను తెలంగాణ పురోగమించేలా, దేశంలోనే అగ్రరాజ్యంగా ఆవిర్భవించాలని కోరుతూ రంజాన్ మాసంలోప్రత్యేకంగా ప్రార్థనలు చేయాలని ముస్లిం సామాజిక వర్గానికి కోరుతున్నానన్నారు.

మున్సిపల్ ఆధ్వర్యంలో చలి వేంద్రం ప్రారంభం

బాన్సువాడ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద పురపాలక సంఘం ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు ఎండలు మండిపోతున్నాయని, వేసవిని దృష్టిలో పెట్టుకొని చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాదాచారులకు, వాహనదారుల దప్పిక తీర్చేందుకు తమవంతు బాధ్యతగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మండల ప్రజలు అప్రమత్తంగా ఉండండి

పెద్ద కొడప్‌గల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పెద్ద కొడప్‌గల్ మండల ప్రజలు దొంగతనాలు జరగకుండ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ మహేందర్ సూచించారు. ఇటీవలి కాలంలో మండలంలో గుర్తు తెలియని వ్యక్తులు దొంగత నాలకు పాల్పడుతున్నారని అటువంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వేసవి కాలం ప్రారంభం అవుతున్నందున ఆరుబయట పడుకునేవారు, ఇండ్లకు తాళాలు వేసి ఊరికి వెళ్లే ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటిపి నెంబర్లను కానీ, బ్యాంకు ఖాతా వివరాలు చెప్పాలని కోరితే వారికి వివరాలు చెప్పరాదని సూచించారు. దీంతో పాటుగానే ఇంటికి తాళాలు వేసి ఊరు వెళ్లే ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు గ్రామాలలో సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

సమయపాలన పాటించని పశువైద్యులు

పెద్ద కొడప్‌గల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల స్థానిక పశువైద్య శాలలో పనిచేస్తున్న పశువైద్యులు సమయపాలన పాటించడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలో పశువులకు సేవలు అందించాల్సిన వైద్యులు సమయానికి రాకపోవడంతో ఇబ్బందులు ఎదురౌతున్నాయని వాపోతున్నారు. అసలే వేసవికాలం కావడం పశువులకు ఏదైనా అత్యవసర చికిత్స చేయాల్సి వస్తే ఇబ్బందులు ఎదురౌతున్నాయని వాపోతున్నారు. ఉదయం సమయంలో పశువులు అందుబాటులో ఉంటాయని, ఆ సమయంలో పశువైద్యులు అందుబాటులో ఉండటం లేదని తెలిపారు. పశువైద్యులు అందుబాటులో ఉండేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఉపాధి కూలీల నిరసన

పెద్ద కొడప్‌గల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పెద్ద కొడప్‌గల్ పరిధిలో పనిచేస్తు కూలీలు శనివారం ఎంపిడివో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. గ్రామ పరిధిలోని కూలీలు స్థానికంగా ఉన్న చెరువులో ఫిష్‌పాండ్ పనులు చేస్తున్నారు. గత ఆరు రోజులుగా కూలీలు పని చేస్తున్న కేవలం రెండు రోజులు మాత్రమే పని చేసినట్లు ఆన్‌లైన్‌లో నమోదు కావడంతో, కూలీలు ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. తాము ఆరు రోజులుగా పనిచేస్తున్న ఆన్‌లైన్‌లో రెండు రోజులు గా నమోదు కావడం ఏంటని ఏపీవో సుదర్శన్‌ను ప్రశ్నించారు. దీంతో ఏపివో సుదర్శన్ ఆన్‌లైన్‌లో సర్వర్ సమస్య కారణంగా కూలీల హాజరు నమోదు కాలేదని, ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని హామి ఇవ్వడంతో కూలీలు ఆందోళన విరమించారు.



ఎంపీడీవో కార్యాలయం వద్ద కూలీల నిరసన తెలుపుతున్న దృశ్యం

ప్రభుత్వ పాఠశాలకు గ్రంథాలయ సామగ్రి అందజేత

రామారెడ్డి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రామా రెడ్డి మండలం మద్దికుంట మండల పరిషత్ పాఠ శాలకు శనివారం యుని మనీ ఫైనాన్స్ సర్వీస్ కం పెనీ సౌజన్యంతో, కామారెడ్డి బ్రాంచ్ ఆధ్వర్యంలో రూ 25 వేల గ్రంథాలయ సామాగ్రిని అందజే శా రు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యా యులు రాజన్న మాట్లాడుతూ పుట్టిన ఊరును మరచిపో కుండా స్వగ్రామంలోని పాఠశాలకు తను పనిచే స్తున్న ఫైనాన్షియల్ కంపెనీ ద్వారా పేద విద్యార్థుల చదువు కోసం గ్రంథాలయ సామాగ్రి అందజేశారు. కామారెడ్డి బ్రాంచ్ మేనేజర్‌సంతోష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రీజినల్ మేనే జర్ రాజకుమార్ మాట్లాడుతూ ప్రతి సంవ త్సరం యూనిమనీ నిర్వహించే స్వచ్ఛంద సేవ లో భాగంగా మద్దికుంట పాఠశాలకు అందిం చడం జరిగిందన్నారు. మునుముందు యూ నిమని ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు, ప్రభుత్వ పాఠశా లలకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహి స్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రధానో పాధ్యాయుడు రాజన్న, ప్రతినిధులు ఆర్ ఎచ్ రాజ్ కుమార్, బిహెచ్ బొమ్మిడి సంతోష్ రెడ్డి, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ రాజు, సిబ్బంది రాజే శ్వర్, వీడీసి ఒరగంటి నారాయణ, ఉపాధ్యా యు లు శ్రీకాంత్, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మద్దికుంట పుస్తకాలు అందజేసిన దృశ్యం

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	110	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

